సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



ఇద్దరు దొంగల అరెస్టు

వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు కరడుగట్టిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు.

-8లో



నమ్మకానికి ప్రతీక భారతి సిమెంట్

పటిష్ట దృఢత్వం, వినియోగదారుల నమ్మకానికి భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ప్రతీకగా నిలుస్తుందని భారతీ సిమెంట్ టెక్నికల్ మేనేజర్ సి.చాయాపతి అన్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.330

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 231 మెట్రిక్ టన్నులు



ఒకటే గమనం.. గెలుపే గమ్యం

- జెడ్పీటీసీ ఉప ఎన్నికలో విజయంపై వైఎస్సార్‌సీపీ వ్యూహ రచన
- నేతలకు దిశానిర్దేశం చేసిన ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఒంటిమిట్టలో నాయకులతో విస్తృతంగా చర్చలు
- మరోవైపు జోరుగా ప్రచారం



వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో సమాలోచనలు చేస్తున్న పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి రాయచోటి: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట ఆధ్యాత్మిక కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఒకపక్క ప్రచారంతోపాటు మరోపక్క ఓటు బ్యాంకు ఉన్న నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఇప్పటికే దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ నేతలకు.. విజయ బావుటా ఎగురవేసేందుకు అవసరమైన వ్యూహాన్ని వివరించారు. ప్రస్తుత రోజులతోపాటు ఎన్నికల ముందు అనుసరించాల్సిన విధానాన్ని వివరించడంతోపాటు సమష్టిగా పని చేస్తూ.. ఒక పథకం ప్రకానం ముందుకు వెళితే విజయం తథ్యమని వివరిస్తూ వచ్చారు. కార్యకర్తలు, నాయకులు, నేతలు, శ్రేణులు ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఒంటిమిట్టలో జెడ్పీటీసీ అభ్యర్థి సుబ్బారెడ్డి అతిథి గృహం వద్ద రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతలతో చర్చించడంతోపాటు సమీక్షించి విజయానికి వ్యూహం రచించారు.

అన్ని వర్గాల ఓట్లపై దృష్టి

వైఎస్సార్ సీపీ నేతలకు రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజున అనుసరించాల్సిన వ్యూహాలతోపాటు ఇతర అనేక అంశాలపై చర్చించారు. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, రాజంపేట, కడప మేయర్ కొత్తమద్ది సురేష్ బాబు, కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులతో పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పని చేస్తూ అన్ని వర్గాల ఓట్లు వైఎస్సార్‌సీపీకి లభించేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.

విజయం తథ్యం

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికలలో భాగంగా అన్ని స్థానాలలో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగిస్తుందని, అలాగే ఒంటిమిట్ట, పులివెందులలో కూడా విజయం తథ్యమని పార్టీ కీలక నేతలు పేర్కొన్నారు. అందుకు సంబంధించి గురువారం ఒంటిమిట్ట మండలంలోని మాధవరం, ఇతర గ్రామాల్లో ప్రచారం సందర్భంగా పలువురు మాట్లాడుతూ టీడీపీ, పోలీసులు ఎన్ని ఆరాచకాలకు తెరతీసినా చివరకు వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. ధర్మ పోరాటంలో విజయం వైఎస్సార్‌సీపీ పక్షాన ఉంటుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అత్యధిక మెజారీటీతో గెలిపించాలని పలువురు కోరారు.

- కుడుమలూరు గ్రామంలో జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి వైఎస్ఆర్‌సీపీ వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి ప్రచారం నిర్వహించారు.



సాలాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ముమ్మరంగా ప్రచారం

వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పెద్ద ఎత్తున నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కడప మేయర్ సురేష్ బాబు, కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పద్మశాలీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జింకా విజయలక్ష్మి, జిల్లా యువజన విభాగపు అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, రాష్ట్ర మైనార్టీ నాయకులు షఫీ ఇలియాజ్, మాజీ కార్పొరేటర్లు శ్రీరంజన్, జయచంద్రారెడ్డిలతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. కొత్తమాధవరంలోని పెద్దరోడ్డు వీధి, స్టేట్ బ్యాంక్ వీధి, భద్రావతి, భావ నారాయణస్వామి ఆలయ పరిసర ఆలయం వీధితో పాటు అన్ని వీధులలో కలియ తిరిగారు. అలాగే గురువారం సాయంత్రం సాలాబాద్‌లో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, పెద్ద పేరూరు, తప్పెటవారిపల్లెల్లో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ప్రచారం నిర్వహించారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, జింకా విజయలక్ష్మి



మాధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజద్‌బాషా, అజయ్‌రెడ్డి తదితరులు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, డీసీ ఆదిత్యరెడ్డి

న్యూస్‌రీల్

మెరుగైన వైద్య సేవలు అందించండి

మదనపల్లె రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ లక్ష్మీనరసయ్య ఆదేశించారు. గురువారం పట్టణ పరిధి నిమ్మనపల్లె రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న రోగులను గుర్తించి స్క్రీనింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కీర్తిప్రియ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగాపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

రాయచోటి: స్వాతంత్ర్య ఫలాలు, వాటి విలువలు, త్యాగాలను స్మరించుకునేందుకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి నాగభూషణం పేర్కొన్నారు. గురువారం ఉదయం రాయచోటి పురపాలక సంఘం, పట్టణ పేదిరక నిర్మూలన సంస్థ, జిల్లా పర్యాటక తదితర శాఖల ఆధ్వర్యంలో రాయచోటిలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'అక్షర ఆంధ్ర'పై శిక్షణ



మాట్లాడుతున్న వయోజన విద్య నోడల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంరెడ్డి

రాయచోటి టౌన్: అక్షర ఆంధ్ర అనే కార్యక్రమంపై రాయచోటి డైట్ కేంద్రంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ అక్షర ఆంధ్ర, ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవిత కల అభ్యాసంపై అవగాహన) అంశాల ద్వారా వివిధ వృత్తులలో ఉన్న 15 ఏళ్లు పైబడిన వయోజనులను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఎక్కువగా ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులు, ఆయాలు, వంట వండేవారు, వివిధ రకాల సహాయకులు, కాపలాదారులు వంటి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీడీఆర్‌డీఏ సత్యనారాయణ, ఏపీఎంలు, సీఎంఎంలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఉపాధి హామీ ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన కల్పించాలి



రాజంపేటలో విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీజీ జానకీరామ్

రాజంపేట రూరల్: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని విద్యుత్‌శాఖ సీజీ ఎం.జానకీరామ్ ఆదేశించారు. రాజంపేటలోని డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఆర్ చంద్రశేఖరరెడ్డి, డీఈఈ ఎన్ రాజశేఖరరెడ్డి, డీఈలు సురేంద్రనాథ్, భాస్కరరావు, మురళీధర్‌రెడ్డి, ఏఈలు ఏంవీ చంద్రశేఖర్, కుమార్, ఈశ్వరరాజు, షఫీ, శ్రీనివాసులు, యోగానందం, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, చలపతీ, బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు ఆదా

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంతో వినియోగదారులకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్ పేర్కొన్నారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యుగంధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పలు శాఖల బ్యాంకు మేనేజర్లు, పీఎం సూర్యఘర్ వెండార్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీపై దాడి చేయడం ఎంత వరకు న్యాయసమ్మతమని గురువారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లే ప్రజా ప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు చేతులు ఎత్తేయడం, ఓ డీఐజీ స్థాయి అధికారి సంఘటనను పత్తి వ్యాపారంగా అభివర్ణించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చుతోందన్నారు. గ్రామంలో వాహనాన్ని అడ్డగించి ధ్వంసం చేయడం, బీసీ వర్గానికి చెందిన రమేష్ యాదవ్‌పై, అలాగే వేల్పుల రాము అనే వ్యక్తిపై దాడులు చేయడం అధికార పార్టీ దౌర్జన్యానికి అద్దం పడుతోందన్నారు. రమేష్ యాదవ్‌ను ఫోన్‌లో పరామర్శించినప్పుడు దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డానని చెప్పడం తనను బాధించిందన్నారు. రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడుల వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రక్షణ చట్టం ఏమైంది?

బీసీలకు రక్షణ చట్టం తెస్తానని చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో బీసీలు దాడులకు గురి కావడం విచారకరమన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఆలోచన చేయడం లేదన్నారు. జగన్ ప్రభుత్వం బీసీ మహిళలకు అందించిన చేయూత, ఆసరా పథకాలను ఎత్తివేసి మోసగించారన్నారు. మగ్గం ఉన్న చేనేతలకు క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేలను జగన్ ప్రభుత్వం అందించేదన్నారు. చేనేతలకు ఈ పదునాలుగు నెలలలో ఏ పథకం అందివ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో చేనేతలకు మెటీరియల్ కొనుగోళ్లకు ఏడాదికి అందించిన రూ. 24 వేల స్థానంలో రూ.50 వేలు అందించే ఏర్పాట్లు చేయాలని, దానిపై ఆలోచనలు చేయకుండా బీసీలపైన దాడులు చేసి తీవ్రంగా గాయపరచడం దుర్మార్గమన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 12న జరగనున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేపట్టినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్'హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో జరిగిన దాడులు, అల్లర్ల సంఘటనలపై సమగ్రంగా విచారిస్తున్నామన్నారు. సంఘటనలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఆ ప్రాంతానికి చెందిన వారు కాకుండా ఇతరులకు అనుమతి లేదన్నారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేందుకు దాదాపు 600 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించామన్నారు.

కుప్పం వెళ్దామా వద్దా!

సాక్షి కథనంతో అధికారుల మల్లగుల్లాలు



మదనపల్లె: హంద్రీ–నీవా కుప్పం డివిజన్ కార్యాలయం మదనపల్లె ఎస్‌ఈ కార్యాలయంలోనే నిర్వహిస్తున్న విషయాన్ని 'కదలరు.. వదలరు' శీర్షికన సాక్షిలో ఇటీవల కథనం ప్రచురితం కావడం తెలిసిందే. ఈ కథనంతో ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా నడిచిపోతున్న డివిజన్ వ్యవహారం వెలుగులోకి రావడం, కుప్పం ఈఈ మదనపల్లెలో ఉంటున్న విషయం మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లడంతో.. ఇప్పుడు ఈ సమస్యపై ఎలా ముందుకు వెళ్లాలన్న సందిగ్ధం అధికారుల్లో నెలకొంది. సాక్షి కథనం మంత్రి నిమ్మల, ఈఎన్‌సీ దృష్టికి వెళ్లినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇక డివిజన్ కుప్పానికి తరలించాల్సిన పరిస్థితి తప్పదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అధికారులు కూడా ఇకపై కుప్పం నుంచే విధులు నిర్వహించాల్సి ఉంటుందని కింది స్థాయి ఉద్యోగులకు చెబుతున్నట్టు తెలిసింది. లేదా కుప్పం డివిజన్ కార్యాలయం ప్రారంభించి అక్కడ ఒక బోర్డు పెట్టి డివిజన్‌ను కుప్పానికి తరలించినట్టు చెప్పే ప్రయత్నం కూడా జరుగుతున్నట్టు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్కడ ఒకరిద్దరు సిబ్బందిని ఉంచి.. మదనపల్లె నుంచే విధులు నిర్వహించుకోవచ్చన్న అభిప్రాయంతో ఉన్నట్టు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో.. అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియాల్సి ఉంది. ఇలా ఉండగా కుప్పం డివిజన్ ఎట్ మదనపల్లె పేరుతో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవాలని ఉన్నతాధికారులకు కొందరు సూచన చేసినట్టు తెలిసింది. ఇలా ఉత్తర్వు తెచ్చుకుంటే మదనపల్లె నుంచి కుప్పానికి వెళ్లి విధులు నిర్వహించే పరిస్థితి ఉండదని ఎత్తుగడ వేసినట్టు కార్యాలయ వర్గాలు చర్చించుకొంటున్నాయి. ముఖ్యంగా సీఎం నియోజకవర్గానికి మంజూరైన డివిజన్‌ను మదనపల్లెలో ఉండేలా.. ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఏ మాత్రం ఉండదని మరి కొందరు స్పష్టంగా చెబుతున్నారు.

బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్, వైద్యాధికారులు

రాయచోటి: పుట్టిన బిడ్డ మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లి పాలే శ్రేయస్కరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బంది.. ప్రతి గర్భిణి స్త్రీకి, ప్రసవించిన ప్రతి తల్లికి, వారి ఇంటిలోని కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'తల్లి ముర్రుపాలు.. బిడ్డకు మొదటి టీకా' పోస్టర్స్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూ లక్ష్మీపతి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరీ, ఐసీడీఎస్ పీడీ హైమావతి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందివ్వాలి

ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందివ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ స్వర్ణాంధ్ర పి-4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

ప్రచారంలో టీడీపీ వర్గీయుల రగడ

- ఒంటిమిట్టలో భగ్గుమన్న విభేదాలు
- జగన్‌మోహన్‌రాజు, మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గీయుల మాటల యుద్ధం



ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలో అభ్యర్థిని ఎంపిక చేసిన తరువాత.. అందరూ కలిసికట్టుగా ఎంపిక చేసిన అభ్యర్థి అని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఒక పక్క ప్రకటించారు. కానీ అది కేవలం పార్టీ పరువు కాపాడుకునేందుకే అభ్యర్థిని ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే అందరూ కలిసి అభ్యర్థి విజయానికి కృషి చేయాల్సింది పోయి.. వర్గ విభేదాలను మనసులో ఉంచుకుని సందర్భంగా వచ్చినప్పుడల్లా ప్రదర్శిస్తున్నారు. గురువారం మండల పరిధిలోని దవంతరపల్లిలో జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారానికి వెళ్లిన టీడీపీ సీనియర్ నాయకుడు, కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి వాగ్వాదానికి దిగారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. వీరిలో వెంకటనరసయ్య మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గం అయితే నరసింహారెడ్డి చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గం. వీరి మధ్య గత కొంత కాలంగా వర్గ విభేదాలు నడుస్తూ ఉండేవి. ఈ క్రమంలో ఒక రోజు కొమర వెంకట నరసయ్య సామాజిక మధ్యమంలో నరసింహారెడ్డిపై వార్డు మెంబర్‌గా గెలవలేని వ్యక్తిని మండల అధ్యక్షుడిగా చేశారంటూ ఘాటుగా విమర్శించారు. అంతే కాదు కొంత కాలం నరసింహారెడ్డి సుగవాసి వర్గంలో కూడా పని చేశారు. కానీ అప్పుడు వెంకట నరసయ్య జగన్‌మోహన్‌రాజు వర్గంలో ఉన్నారు. ఆ సమయంలో ఒంటిమిట్ట పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ సదస్సులో నరసింహారెడ్డిని, ఆయన అనుచరులను వెంకట నరసయ్యతోపాటు ఆయన అనుచరులు ఒంటిమిట్ట పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ సదస్సులో పక్క ఊరి వారికి ఏం పని ఉందని అసభ్య పదజాలంలో దూషించారు. ఇది ఇలా ఉంటే ఏమైందో తెలియదు సుగవాసి టీడీపీపై అసంతృప్తితో పార్టీకి ఆయన రాజీనామాచేసి వైఎస్సార్‌సీపీలో చేరడంతో సుగవాసి వర్గంలో ఉన్న నరసింహారెడ్డి జగన్‌మోహన్‌రాజు వర్గంలో చేరారు. అది ఇష్టంలేని వెంకట నరసయ్య.. జగన్‌మోహన్‌రాజు వర్గాన్ని వీడి మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గంలో చేరారు. ఇవన్నీ మనసులో పెట్టుకున్న నరసింహారెడ్డి సమయం కోసం ఎదురు చూస్తున్నట్లు.. గురువారం మండల పరిధిలోని దవంతరపల్లిలో జరిగే ప్రచారానికి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ వస్తున్నాడని తెలిసి వెంకట నరసయ్య అక్కడికి వెళ్లాడు. అది చూసిన నరసింహారెడ్డి అతనికి జరిగిన అవమానాలన్నీ గుర్తుకు తెచ్చుకుని కోపోద్రిక్తుడై వెంకట నరసయ్యతో.. 'నిన్ను ఎవ్వడు ఇక్కడికి రమ్మన్నాడు, ఏ ఊరి నీది' అని అవమానంగా మాట్లాడాడు. దీంతో అవమానం భరించలేక వెంకట నరసయ్య నరసింహారెడ్డికి ఎదురు తిరిగాడు. ఇద్దరి మధ్య అసభ్య పదజాలంతో మాటల యుద్ధం జరిగింది. ఇది చూసిన ప్రజలు ఇదేం విడ్డూరం అంటూ నోరు వెళ్లబెట్టి చూస్తూ ఉండి పోయారు. ఈ ఘటన ఎంత వరకు దారి తీస్తుందోనని మండల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు సమర్పించండి



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల కోసం అధిక సంఖ్యలో నామినేషన్లు సమర్పించి అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. రాయచోటి పట్టణంలోని డైట్ హాల్‌లో గురువారం జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ శిక్షణ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మండలి విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల కోసం 6–12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనేలా చూడాలన్నారు. నామినేషన్లను జాతీయ స్థాయిలో పరిశీలించి అత్యుత్తమ అన్వేషణాత్మక ఆలోచనలను ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేస్తారన్నారు. అవార్డుకు ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు అందిస్తారన్నారు. వీరికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రాజెక్టుకు మేధోసంపత్తి హక్కులు ఇస్తారన్నారు. రాయచోటి డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, రాజంపేట మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు, సెక్టోరియల్ అధికారి జనార్ధన్, రీసోర్స్ సభ్యులు సెట్టెం ఆంజనేయులు, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి కార్మికుడికి గాయాలు


తీవ్రంగా గాయ పడిన శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : మిద్దెపై నుంచి జారిపడి భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని గౌతమీ నగర్‌కు చెందిన ఎల్లప్ప కుమారుడు శ్రీనివాసులు(25) భవన నిర్మాణ పనుల్లో భాగంగా కమ్మీ పని చేస్తున్నాడు. గురువారం సీటీఎంలో ఓ ఇంటిపై పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి నిటారుగా కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన చైతన్య

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద గురువారం ఉదయం చెన్నైకు వెళ్తున్న కారు ఢీకొని చైతన్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన చైతన్య కొత్తపల్లిలో నివాసముంటున్నారు. గాయపడిన చైతన్యను స్థానికులు మెరుగైన చికిత్సకోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


మృతుడు ఈశ్వర్‌రెడ్డి

చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామం కొల్లవాండ్లపల్లెకు చెందిన రైతు ఈశ్వర్‌రెడ్డి(38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఈశ్వర్‌రెడ్డి విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

పిడుగు పడి ఇల్లు ధ్వంసం


దెబ్బతినఇంటిపై కప్పు దెబ్బతిన్న దృశ్యం

నిమ్మనపల్లె : పిడుగు పడి ఇల్లు ధ్వంసమైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటాక మండలంలో కురిసిన వర్షానికి అగ్రహారం పంచాయతీ బండమీదపల్లె హరిజనవాడలో వెంకటరమణకు చెందిన ఇంటిపై పిడుగుపడింది. ఆ సమయంలో వెంకటరమణ భార్య సరోజతోపాటు బయట ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంటి గోడలు, పైకప్పు, ఇంట్లోని వస్తువులు పూర్తిగా ధ్వంసమై పెద్దమొత్తంలో నష్టం వాటిల్లింది. బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేయగా ఎస్‌ఐ తిప్పేస్వామి, ఆర్‌ఐ రమేష్, వీఆర్వో ప్రవీణ్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నష్టంపై అంచనా వివరాలతో నివేదిక ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.

కరడుగట్టిన దొంగల అరెస్టు

- అర కిలో బంగారం, పది కిలోల వెండి ఆభరణాలు, బైక్ స్వాధీనం
- నాటు తుపాకీ, బొలెరో వాహనం, ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

కడప అర్బన్ : వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు కరడుగట్టిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.60 లక్షల విలువ చేసే అర కిలో బంగారం, రూ.10 లక్షల విలువ చేసే పది కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విలేకరులతో వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ నిందితుల వివరాలను గురువారం వెల్లడించారు.

కడప జిల్లా బద్వేల్ టౌన్ పరిధిలోని చెన్నంపల్లిమిట్ట వద్ద నివాసముంటున్న గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, గౌరీశంకర్‌నగర్‌కు చెందిన నూతి వెంకటసుబ్బయ్య గత రెండేళ్లుగా తాళం వేసిన ఇళ్లు పగలు గుర్తించడం, రాత్రి చోరీలకు పాల్పడడం అలవాటు చేసుకున్నారు. వీరు ఎరచ్రందనం అక్రమ రవాణా చేయడమేగాక, కడప, నెల్లూరు జిల్లాలో తాళం వేసిన ఇళ్ల తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే ఇళ్ల చోరీలో తక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలు లభించడంతో సంతృప్తి చెందక, ఎక్కువ మొత్తంలో ఆభరణాలు దోచుకోవాలని ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలోనే కడప, అన్నమయ్య, సత్యసాయి, నెల్లూరు, కాకినాడ జిల్లాల్లోని బంగారు దుకాణాలకు తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. గుంటూరులో బైక్ చోరీ చేశారు. ఈ ప్రయత్నంలోనే గతంలోనూ అరెస్టయి జైలుకు వెళ్లాడని పోలీసుల విచారణలో తేలింది. తీరికసమయాల్లో పేకాడడం, సహచరులతో లంకమల అడవికి వెళ్లి నాటు తుపాకీతో వన్యప్రాణులను వేటాడడం చేశారు. గుమ్మళ్ల వెంకటసుబ్బయ్యపై గతంలో 28 వరకూ ఎర్ర చందనం అక్రమ రవాణా, 38 చోరీ కేసులు నమోదయ్యాయి. ఇతడిపి పీడీ యాక్ట్ ఉండడమేగాక, జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చాడు.

చోరీలు పెరగడంతో పోలీసుల నిఘా

జిల్లాలోని పోరుమామిళ్ల, బి.కోడూర్, మైదుకూర్, బద్వేల్ టౌన్, కలసపాడు, ఖాజీపేట, కాశినాయన, దువ్వూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లపై పగలు రెక్కీచేసి, రాత్రి సమయాలలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీలు ఇటీవల పెరిగాయి. దాదాపు 12 ఇళ్లు, బంగారు దుకాణంలోనూ ఈ చోరీలు జరగడంతో ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. మైదుకూర్ డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో బద్వేల్ రూరల్ సీఐ ఎం.నాగభూషణ్, మైదుకూరు యూసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, బద్వేల్ రూరల్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్, సిబ్బందిని ప్రత్యేక బృందంగా నియమించి నిఘా పెంచారు. గోపవరం మండలం పీపీకుంట సమీపంలోని చెలిమికుంట అటవీ ప్రాంతంలో ఎరచ్రందనం దుంగలు నరికి కర్ణాటకలోని కటికనహళ్లికి అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారం తెలియడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, నూతి వెంకటసుబ్బయ్య ఎరచ్రందనం రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి బొలెరో వాహనం, నాలుగు ఎర్రచందనం దుంగలు, నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా గత నేరచరిత్ర కలిగిన వ్యక్తులని గుర్తించారు. అనంతరం పలు చోట్ల చోరీలకు పాల్పడినట్లు తెలియడంతో అరెస్టు చేశారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంస

మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, నూతి వెంకటసుబ్బయ్యలను అత్యంత చాకచక్యంగా అరెస్టు చేసి, చోరీ సొత్తు, ఎర్రచందనం దుంగలు, నాటు తుపాకీ రికవరీ చేసిన మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, బద్వేల్ రూరల్ సీఐ ఎం.నాగభూషణ్, రమణారెడ్డి, కె.శ్రీకాంత్, చిరంజీవి, శివప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఎరువు నిల్వలపై ఆందోళన వద్దు


రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేడీఏ చంద్రానాయక్

ఒంటిమిట్ట : జిల్లాలో ఎరువు నిల్వలు ఉన్నాయని.. రైతులు ఆందోళన పడవద్దని వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రానాయక్ అన్నారు. మండలంలోని రాచపల్లి రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలోనేగాక ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువు అందుబాటులో ఉందన్నారు. కాంప్లెక్స్, యూరియా కలిపి వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. వరిపంటకు యూరియా 90 కేజీలు చొప్పున రెండు దఫాలుగా వేస్తే సరిపోతుందని, అదనంగా యూరియా వాడటంతో నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జయలక్ష్మి, అమరావతి, వంశీ, రైతులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం.. దొంగకు దేహశుద్ధి

రాజుపాళెం : పట్ట పగలే రహదారి పక్కనే ఉన్న ఇంట్లో ఓ దొంగ చోరీకి యత్నించగా.. గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన రాజుపాళెం మండలం టంగుటూరులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు. కానగూడూరు ప్రధాన రహదారిలోని ఉంటున్న రైతు నంద్యాల వెంకట సుబ్బయ్య గ్రామానికి దూరంగా ఉన్న సచివాలయం వద్ద పని నిమిత్తం వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకోగా అప్పటికే ఇంటి తలుపులు మూసివేసి దుండగుడు ఇంట్లో ఉన్న ఇనుప బీరువా పగలగొట్టే పనిలో కనిపించారు. రైతు వెంకటసుబ్బయ్యను చూసి దుండగుడు ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. రైతు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి దుండగుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాలైన వెంకట సుబ్బయ్యను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్‌ఐ వెంకటరమణ పరిశీలించారు. చోరీకి పాల్పడిన దుండగుడు దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, షేక్ మహమ్మద్ రఫీగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

తాళ్లపాకలో వరలక్ష్మీవ్రతం

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతంను ఘనంగా నిర్వహించనున్నట్లు తాళ్లపాక టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలకు అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపుదారం, కంకణాలు ఉచితంగా అందజేస్తామన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ వ్రతం నిర్వహిస్తామన్నారు. రాజంపేట పరిసర ప్రాంతాల మహిళలు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు (31 జూలై 2025) లోపు పిల్లలు ఈ దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఆదర్శవంతమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు ఆడటం, సంఘ సేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవలు అందించిన వారు దీనికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

10న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

రాజంపేట రూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 10వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తెలియజేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో 10న మాధవ్ చేపట్టే కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ



సిద్దవటం అటవీ ప్రాంత పరిధిలో ఎర్రచందనం కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. దాదాపు 30కి పైగా కార్లు, లారీలు, ఐచర్ వాహనం, ట్రాక్టర్, ఆటో, ఇతర ద్విచక్ర వాహనాలు మూలకు పడేయడంతో చెత్త, పిచ్చిమొక్కల మధ్య ఉండిపోయాయి. కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి వాహనాల ప్రధాన సామాన్లు తొలగించి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వాటిని వేలం వేసి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. – సిద్దవటం

స్కూల్ వ్యాన్ కిందపడి బాలుడు దుర్మరణం


మృతి చెందిన బాలుడు దివాకర్

నిమ్మనపల్లె : ముద్దుముద్దుగా మాట్లాడుతూ బడికి వెళ్లిన పసివాడు.. ఇంటికి చేరకుండానే అనంత లోకాలకు చేరాడు. రోజూ తాను ప్రయాణించే స్కూల్ వ్యాన్ రూపంలో బాలుడిని మృత్యువు బలితీసుకుంది. నిమ్మనపల్లె మండలంలో గురువారం ఈ సంఘటన జరిగింది. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ పాత కొండసానివారిపల్లెకు చెందిన మల్లికార్జున, శ్రావణి దంపతుల కుమారుడు దివాకర్(4) నిమ్మనపల్లె విజయవాణి స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. పాఠశాల ముగిసిన అనంతరం స్కూల్ వ్యాన్‌లో ఇంటికి బయలుదేరాడు. పాతకొండసానివారిపల్లె వద్ద విద్యార్థులను తల్లిదండ్రులు వ్యాన్ నుంచి కిందకు దించారు. బస్సు దిగిన దివాకర్ వెనుక నుంచి కాకుండా నిలిచి ఉన్న బస్సు ముందువైపు నుంచి ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో దివాకర్ వ్యాన్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. స్కూల్ వ్యాన్‌లో అటెండర్ లేకుండా డ్రైవర్ ఒకడే విద్యార్థులను తీసుకురావడంతో ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోమటివాని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతి


మద్దిరెడ్డి (ఫైల్)

మదనపల్లె రూరల్ : పట్టణంలోని కోమటివానిచెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. కురబలకోట మండలం తూగువారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు మద్దిరెడ్డి(70) సర్కారుతోపు వద్ద నివాసముంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీకై వెతుకుతున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్న సమయంలో కోమటివానిచెరువు కట్టమీద మద్దిరెడ్డి నడిచి వెళుతూ ప్రమాదవశాత్తు జారి నీటిలో పడ్డాడు. వెంటనే స్థానిక యువకులు బయటకు తీసి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే బాధితుడు మృతి చెందాడని నిర్ధారించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మద్దిరెడ్డిగా నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు


బైక్‌లో చీర చిక్కుకుని గాయపడిన శాంతమ్మ, ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయపడిన పూజిత, కోమలి

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ గుర్రంవాండ్లపల్లెకు చెందిన పూజిత(18), తన అక్క కుమార్తె కోమలి(5)తో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరింది. మార్గమధ్యంలో కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా ములకలచెరువుకు చెందిన పెయింటర్ వెంకటరమణ భార్య శాంతమ్మ(45) అనారోగ్యం కారణంగా చికిత్సకై కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో వేపూరికోట వద్ద ఆమె చీర కొంగు బైక్ వెనుకచక్రంలో చిక్కుకుని కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

బలమైన నమ్మకానికి ప్రతీక భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్


మేస్త్రీలకు బీమా పత్రాలు అందిస్తున్న చాయాపతి

బి.కొత్తకోట : బలమైన నమ్మకం, పటిష్ట దృఢత్వం, వినియోగదారుల నమ్మకానికి భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ప్రతీకగా నిలుస్తుందని భారతీ సిమెంట్ టెక్నికల్ మేనేజర్ సి.చాయాపతి అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డులోని భగవాన్ సాయిరాం స్కూల్ ఎదురుగా భారతి సిమెంట్ డీలర్, ఎస్ఎల్‌వీ ఎంటర్ ప్రైజస్ అండ్ బోర్‌వెల్స్ నిర్వాహకులు సి.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాయాపతి మాట్లాడుతూ భారతీ సిమెంట్ ప్రత్యేకతలు, నాణ్యతా ప్రమాణాలు, విశిష్ట అంశాలను వివరించారు. సిమెంట్ తయారీ విధానం, భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ సాంకేతిక నిపుణులు పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతీ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి ఇస్తున్నందున తూకం తగ్గడం ఉండదని, ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం లేదన్నారు. సిమెంట్ రంగంలో భారతీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఎం.సుబ్బరాయుడు, డీలర్ సి.వేణుగోపాల్ రెడ్డి, మేస్త్రీలు పాల్గొన్నారు.

టీ తాగుతూ చర్చించుకుందాం


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ టీ తాగుతూ చర్చించుకుందాం కార్యక్రమాన్ని ప్రారంభించారని ఏపీజీఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. రాయచోటి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిల విషయం ప్రభుత్వం పట్టించుకోలేదని, మూడేళ్ల సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేల కోట్ల బకాయి ఉందని ఈ మొత్తాన్ని ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, మోహన్‌బాబు, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ ఎంవీ. సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజా, ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మదనపల్లె రూరల్ : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ అన్సర్ బాషా తెలిపారు. పట్టణంలోని శెట్టివారివీధికి చెందిన ఓ యువతి(17) ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండాపోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం యువతి తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన శంకర(ఫైల్)

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఈ నెల 3న మండలంలోని వేంపల్లె హరిజనవాడకు చెందిన వెంకటస్వామి కుమారుడు శంకర వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. చీకల బైలు పంచాయతీ దారువారిపల్లె వద్ద ఐచర్ వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు విచారణ చేస్తున్నామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు సమీపంలోని కల్వర్టు వద్ద గురువారం సాయంత్రం మినీ లారీ బోల్తా కొట్టింది. మినరల్ వాటర్ బాటిళ్ల లోడుతో తిరుపతి వైపు వెళ్తూ డ్రైవర్ లారీని అతివేగంగా నడిపాడు. మలుపు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో ఎవరికీ ఏమి కాలేదు. లారీలో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీయగా అతని భయంతో పారిపోయాడు. ఎస్‌ఐ మహేష్ నాయుడు, సిబ్బంది ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

టీటీడీ అధికారుల తీరుపై భక్తుల నిరసన

ఒంటిమిట్ట : రాష్ట్ర దేవాలయంగా గుర్తించిన ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో భక్తులు రామనామ స్మరణ చేస్తున్న సమయాన మైక్ కట్ చేసి అశ్రద్ధగా, అవమానకరంగా వ్యవహరించిన టీటీడీ అధికారుల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకరస్వామి అన్నారు. ఈ చర్యకు నిరసనగా గురువారం ఉదయం 11 గంటలకు దేవస్థానం ఎదుట భక్తులు భారీగా గుమిగూడి రామనామ స్మరణ నిర్వహించారు. ఈ అవమానానికి భజన భక్తులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. భక్తులను అవమానించే విధంగా ఆలయ అధికారుల తీరును నిరసిస్తూ.. భక్తులు రామనామమే రక్ష అంటూ ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. భక్తి భావాలకు టీటీడీ అధికారులు అవమానం కల్గించకూడదని వారు స్పష్టం చేశారు.

గడువు పొడగింపు

కడప ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఆగష్టు 13వతేదీ వరకూ గడువు పొడగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. 2025–26 సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.